సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డి

- 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు
- ఆసరా లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని జీవీఎంసీ 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అయిన సందర్భంగా 95వ వార్డు పరిధి గొల్లవిల్లిపాలెంలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ముమ్మన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ అందిస్తున్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాబలంతో ఆయన ముందుకు సాగుతున్నారని చెప్పారు. మూడో విడత డ్వాక్రా మహిళల ఖాతాల్లోకి నేరుగా నగదు జమచేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీవో కనకరత్నం, వైఎస్సార్‌సీపీ 95వవార్డు నాయకులు రాపర్తి సూరిబాబు, మంగమ్మ, కె. సంతోష్, బొడ్డు దేముడుబాబు, వెంకటేష్, ఆర్పీలు కనకమహాలక్ష్మి, ఆసరా లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్



జగనన్న అమ్మఒడి నాలుగో ఏడాది కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రాన్సిట్ హాల్ట్‌లో భాగంగా విశాఖ ఎయిర్‌పోర్టులో కొద్దిసేపు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. - సింహాచలం

కరకవానిపాలెం పాలసొసైటీ అధ్యక్షుడిగా బోకం



అప్పలనాయుడును సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ చిరికి దేముడు తదితరులు

సింహాచలం: పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీ కరకవానిపాలెం గ్రామపాల సొసైటీ అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు బోకం అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం మండల వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ చిరికి దేముడు దుశ్శాలువాతో అప్పలనాయుడను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గొరపల్లి గ్రామ సర్పంచ్ గొరపల్లి శ్రీను పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



షేక్ మీరాబికి ఆర్థిక సాయం అందిస్తున్న బంగారుతల్లి భక్త బృందం సభ్యులు

సబ్బవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సబ్బవరం శివారు పెదనాయుడుపాలేనికి చెందిన వ్యక్తికి సబ్బవరంలోని బంగారుతల్లి భక్త బృందం సభ్యులు రూ.10,500 నగదు అందించారు. గ్రామానికి చెందిన షేక్ మీరాబి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయనకు కాలు విరిగిపోవడంతో నెల రోజులు ఇంటికి సరిపడా నిత్యావసర వస్తువులు కూడా అందజేశారు. మూడేళ్ల వరకు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో మరో రెండు నెలలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులు అందజేయనున్నట్టు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. బీఎంఎస్, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేట్ ఎదుట కార్మికుల సమస్యలపై బుధవారం ధర్నా చేపట్టారు. రైల్వే ట్రాక్‌లో పనిచేసే కార్మికులకు ట్రావెలింగ్ అలవెన్స్, పరిశ్రమలో ఏర్పాటు చేసిన మెడికల్ పరీక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఒకే రకమైన గేట్ పాస్‌లు వర్తింపజేయాలని.. అన్‌స్కిల్డ్ కార్మికులను సెమీ స్కిల్డ్ చేయాలని కోరారు. ప్రత్యేక అలవెన్స్ మంజూరు చేసే వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు, బీఎంఎస్ రాష్ట్ర కోశాధికారి ఎల్.ప్రసాద్, అధ్యక్షుడు బి.రమణ, జనరల్ సెక్రటరీ సతీష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కుంచరాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు



గంజిపేటలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు గెంజిపేటలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ అధికారం కోసం టీడీపీ, జనసేన పార్టీలు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు బుద్ధి చెప్పినా సిగ్గు లేకుండా.. జనసేన పార్టీని వెనకేసుకుని ఎన్నికలకు రావడం సిగ్గు చేటన్నారు. 14 ఏళ్ల సీఎంగా పాలన సాగించి, రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి సాధించకుండా ఏ విధంగా వస్తారని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో సీఎంగా గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 79 వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, పార్టీ సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, ప్రకాష్, గంజి వెంకటలక్ష్మి, గంజి సురేష్, కర్రి నర్సింగరావు, ఆశాజ్యోతి, సుందరపు శ్రీనివాసరావు, గొన్న హేమచంద్ర, జి.హరీష్, పూర్ణానందశర్మ, అధికారులు, వలంటీర్లు, వార్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

ఎంపీపీ బోకం సూర్యకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: వివక్ష లేని పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విధానమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గుల్లేపల్లి గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు చేరువ చేయాలనే ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమం నెల రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వలంటీర్లు,సచివాలయ సిబ్బంది,గృహ సారథులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, జగనన్న సురక్ష నియోజకవర్గ కన్వీనర్ కొటాన రాము, జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,బండారు శ్రీను, ఎంఎల్‌వో హేమంత్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు



బలరామ, శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు

డాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీ వద్ద సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన జగన్నాథ స్వామి బుధవారం బలరామ, శ్రీ కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు మేల్కొలుపు అనంతరం ప్రత్యేక పూజలు, పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విష్ణుసహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా నిర్వహించారు. చందన డ్యాన్స్ అకాడమీ కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష స్వామికి పూజలు చేశారు. ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా దశావతారాల్లో చివరి రోజైన గురువారం స్వామి శేషపాన్పుపై దర్శనమివ్వనున్నారు. 30న స్వామి తిరుగు రథయాత్ర నిర్వహిస్తారు. జూలై ఒకటి ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.

కార్మిక చట్టంపై అవగాహన అవసరం



కూలీలకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి వెంకటశేషమ్మ

సింహాచలం: పెందుర్తి మండలం గొరపల్లిలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సర్వీసెస్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు, రైతు కూలీలకు కార్మిక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సర్వీసెస్ న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ కార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. కూలీల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జి.మాణిక్యాంబిక, దేవిశ్రీ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ గోవింద్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లిలో రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులతో గ్రామంలోని రైస్ మిల్లు నుంచి రావాడ వారి ఇళ్ల వరకూ గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్టు సర్పంచ్ నారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ వైస్ సర్పంచ్ మిడతాడ మహాలక్ష్మినాయుడు, నాయకులు గొర్లి ఎర్రినాయుడు,వనం వెల్లారావు, వనం దేముడు,వెన్నల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

విద్యార్థి సంఘం ఎన్నిక

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో బుధవారం విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికైన విద్యార్థి సంఘ నాయకులు తమ విధుల పరిరక్షణ కోసం కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నాయకులుగా ఎదగడం నేర్చుకోవడం ముఖ్యమన్నారు. కార్తీక్ (హెడ్ బాయ్), అనుశ్రీ (హెడ్‌గర్ల్), హౌస్ కెప్టెన్‌లుగా సరయు, ధ్రువన్, చార్మిత, ధార్మిక ఎన్నికయ్యారు.

నేడు సబ్బవరంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పర్యటన

సబ్బవరం: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సబ్బవరంలో గురువారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వ్యవసాయ కార్యాలయంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ చేస్తారు. 9.30 గంటలకు సబ్బవరం కేజీబీవీ లో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం కొటాన అప్పారావు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మర్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

సంపత్ వినాయకుని హుండీల లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

సీతమ్మధార: ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు గానూ రూ.17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, బి.జి.ఎస్ ప్రసాద్, ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా సజావుగా గమ్యానికి చేరుకోవచ్చని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ అన్నారు. పెందుర్తిలోని భాష్యం స్కూల్ విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధలనపై అవగాహన కల్పించారు. రోడ్ క్రాసింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను తెలియజేశారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ విద్యార్థి ఇంట్లోని పెద్దలకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేయాలని కోరారు. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

అమ్మఒడి ప్రసంగం తిలకించిన విద్యార్థులు

సింహాచలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అమ్మఒడి నిధుల విడుదల సందర్భంగా చేసిన ప్రసంగాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పెందుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్మార్ట్ టీవీలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఉపాధ్యాయులు చూపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూపీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ సీఎంకు చాతుర్మాస దీక్ష ఆహ్వానం



ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ దామికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామితో భేటీ అయ్యారు. వచ్చేనెల 3న రుషికేష్‌లో ప్రారంభించనున్న చాతుర్మాస దీక్షపై చర్చించారు. విశాఖ శ్రీశారదాపీఠం రిషికేష్ ఆశ్రమాన్ని సందర్శించాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున దీక్షకు ఎలాంటి సహకారమైనా అందిస్తామని స్వాత్మానందేంద్ర స్వామికి హామీ ఇచ్చారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మృతుడు ఎస్.రాయవరం వాసి



ప్రమాద స్థలంలో మనోహర్ మృతదేహం



మనోహర్ (ఫైల్)

సింహాచలం : అడవివరం ప్రధాన రహదారిపై బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలోని ఇందిరా న్యూ కాలనీలో నివసిస్తున్న మాస మనోహర్ (23) రాంబిల్లిలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట అడవివరం ఎస్సీ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై బుధవారం మధ్యాహ్నం ఎస్.రాయవరం బయలుదేరాడు. ఈ క్రమంలో అడవివరం ప్రధాన రహదారిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి... ఎదురుగా గోపాలపట్నం వైపు నుంచి వస్తున్న కారు టీవీటవర్ కాలనీ వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతూ మనోహర్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మనోహర్ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ నరసింహారావు, ఎస్ఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు నడపడమే ప్రమాదానికి కారణమని సీఐ నరసింహారావు గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లి లేదు. తండ్రికి కూడా దూరంగా ఉంటున్నట్టు తెలిసింది. ఎస్.రాయవరంలోని ఇందిరా న్యూ కాలనీలో బంధువులతో కలిసి ఉంటున్నాడు. మనోహర్ మృతి వార్త తెలుసుకుని అడవివరం ఎస్సీ కాలనీలో ఉంటున్న బంధువులు సంఘటనా స్థలానికి వచ్చి బోరున విలపించారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్)తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ప్రతినిధి, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov. in/ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని వారు కోరారు.